జవహర్‌కు పదవి పట్ల హర్షం

ప్రజాశక్తి - తాళ్లపూడి

టిడిపి జాతీయ కార్యదర్శి, మాజీ మంత్రి కెఎస్.జవహర్‌ను ఎస్‌సి సెల్ కమిషన్ రాష్ట్ర చైర్మన్‌గా నియమించడం పట్ల టిడిపి నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. తాడిపూడి గ్రామంలో తెలుగు యువత ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు యువత నాయకులు నామా సురేంద్ర మాట్లాడారు అధికారంలో ఉన్నా, లేకపోయినా పార్టీ కోసం కష్టపడే వ్యక్తులకు టిడిపి తగిన ప్రాధాన్యత ఇస్తుంది అనడానికి జవహర్ పదవి రావడమే నిదర్శనమన్నారు. ఈ క్రమంలో సురేంద్ర ఆధ్వర్యంలో కార్యకర్తలు జవహర్ ఇంటికి వెళ్లి అభినందనలు తెలిపారు.

ధరల మంట

- రోజురోజుకూ పెరుగుతున్న కూరగాయల రేట్లు
- ఆందోళనలో కొనుగోలు దారులు
- రూ.50 పలుకుతున్న కొత్తిమీర కట్ట



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో కూరగాయల ధరలు ఆకాశానంటుతున్నాయి. కాలమేదైనా పెరుగుతున్న ధరలు సగటు మనిషిని అతలాకుతలం చేస్తున్నాయి. శ్రావణం, కార్తీకం తదితర మాసాల్లో ధరలు అధికంగా ఉండటం పరిపాటి. అయితే ఏడాదిలో 8 నెలలకు పైగా ధరలు కొండ దిగనంటున్నాయి. తాజాగా అకాల వర్షాలు, ఎండ తీవ్రత ప్రభావం ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లోనూ కూరగాయల పంటలపై వర్షాల ప్రభావం చూపించింది. దీంతో ధరలు పెరిగాయి. జిల్లాలో గణనీయమైన సాగు విస్తీర్ణం ఉంది. అయితే డిమాండ్‌కు తగ్గట్లుగా ఉద్యానవన శాఖ ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో రైతులు కూరగాయల సాగు చేసేందుకు ముందుకు రావటంలేదు. మరో వైపు ఎప్పటికపుడు ధరలు పెరుగుదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలను దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

ధరల పెరుగుదలతో జనం బెంబేలు

జిల్లాలో గత కొన్ని రోజులుగా రికార్డు స్థాయిలో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. జిల్లాలోని ప్రస్తుతం ధరలు ఈ విధంగా ఉన్నాయి. రూ.5 వచ్చే కొత్తిమీర కట్ట ఇప్పుడు రూ.50 పలుకుతుంది. వంకాయలు కేజీ గత నెల రూ.24 కాగా ప్రస్తుతం 48కి చేరాయి, కాకర రూ.30 నుంచి రూ.54కు చేరింది. క్యాలీ ఫ్లవర్ రూ.30 నుంచి రూ.44కు చేరింది. క్యారెట్ రూ.24 నుంచి రూ.40కి చేరింది. బీన్స్ రూ.80 నుంచి రూ.100కు చేరింది. చిక్కుడు రూ.50 నుంచి రూ.70కి చేరింది. క్యాప్సికం రూ.50 నుంచి రూ.64కు చేరింది. పచ్చిమిర్చి రూ.30 నుంచి రూ.54కు చేరింది. బీర రూ.36 నుంచి రూ.50కి చేరింది. ములక్కాయ పెద్దది రూ.15కి చేరింది. వెల్లుల్లి పావు కేజీ రూ.80కి చేరింది.బహిరంగ మార్కెట్లో కిలో రూ.20 నుంచి రూ.30 అదనంగా విక్రయాలు జరుగుతున్నాయి.

జిల్లాలో 32 వేల ఎకరాల్లో కూరగాయల సాగు

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 32,500 ఎకరాల్లో కూరగాయల సాగు జరిగింది. రబీ సీజన్‌లో 75 వేల ఎకరాల్లో కూరగాయల సాగు జరిగాల్సి ఉంది. గత నాలుగేళ్లతో పోల్చితే ఈ సీజన్‌లో 30 శాతం సాగు విస్తీర్ణం తగ్గింది. వేసవిలో కూరగాయల కొరత ఉత్పన్న కాకుండా సమ్మర్ క్రాప్స్‌ను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. 50 శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయాల్సి ఉన్నప్పటికీ 2024-25లో విత్తనాల పంపిణీ చేపట్టలేదు. ప్రస్తుతం జిల్లాలో రంగంపేట, సీతానగరం, కోరుకొండ, పెరవలి, ఉండ్రాజవరం తదితర మొత్తం 10 మండలాల్లో కూరగాయలను రైతులు సాగు చేస్తున్నారు. కూరగాయల సాగును చేసేందుకు అన్నదాతలకు అవగాహన కరువవుతోంది. సాగు అనుభవంతోనే అక్కడక్కడ చేస్తున్నప్పటికీ.. జిల్లాలో డిమాండ్‌కు సరిపడా కూరగాయల సాగు జరుగట్లేదు. సాగుకు ప్రణాళికలు రూపొందించి వివిధ రకాల కూరగాయల విత్తనాలను అందుబాటులో ఉంచాల్సినప్పటికీ అధికార యంత్రాంగం ఆ దిశగా చర్యలు తీసుకోవటంలేదు. అలాగే జిల్లా వాతావరణ పరిస్థితులకు తట్టుకునే విత్తనాలను ఎంపిక చేసి రైతులకు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.రైతులకు విత్తనాల ఎంపికలో అవగాహన లేకపోవడంతో దిగుబడులు తగ్గి నష్టాల పాలు కావాల్సి వస్తోందంటున్నారు. కొన్ని సార్లు చీడపీడలు ఆశించడంతో తీవ్రంగా నష్టపోతున్నామని, కూరగాయల సాగుకు వెనకడుగు వేస్తున్నారు.

కూరగాయల ధరలు తగ్గడం లేదు

కూరగాయల ధరలు తగ్గడంలేదు. రైతు బజారులో సైతం టమోటాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మిగిలినవన్నీ ఏది కొన్నాలన్నా రూ.50 పైమాటే.రూ.200 వెచ్చించినా నాలుగు రకాలు రావడం లేదు. బహిరంగ మార్కెట్లో ధరలు మరింత అదనంగా ఉన్నాయి. అధికార యంత్రాంగం దృష్టి సారించాలి. సామాన్యులకు కూరగాయలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

- వి.సత్యనారాయణ కొనుగోలుదారుడు, రైతు బజారు నటరాజ్ సెంటర్

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

విద్యారంగ సమస్యల పరిష్కారానికి

డిఇఒ కార్యాలయం వద్ద యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, బదిలీలు, ప్రమోషన్లు నేపథ్యంలో తలెత్తుతున్న విద్యా సమస్యలను వెంటనే పరిష్కరించాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సోమవారం డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పి.జయకర్, ఎ.షరీఫ్ ఆధ్వర్యంలో ఈ ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి మాట్లాడారు. అధికారులు ప్రతి వారం గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల నేతలతో సమస్యలపై చర్చిస్తున్నప్పటికీ వాటిని ఖాతారు చేయట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్ణయాల వల్ల విద్యా వ్యవస్థ తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అధ్యక్షులు ఎ.జయకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం జిఒ 117 తీసుకొచ్చి విద్యా వ్యవస్థను అతలాకుతలం చేసిందన్నారు. ఉపాధ్యాయుల సంఖ్య తగ్గించడం వల్ల దాదాపు పది లక్షల మంది విద్యార్థులు ప్రయివేటు పాఠశాలల బాట పట్టారన్నారు. జిఒ 117 రద్దు చేస్తామని, పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పిన ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా అదే బాటలో నిర్ణయాలు తీసుకోవడం చాలా దారుణమన్నారు. ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ మాట్లాడుతూ హై స్కూళ్లలో సబ్జెక్టు టీచర్లు తగ్గించడం వల్ల విద్యా ప్రమాణాలు తీవ్రంగా పడిపోయే ప్రమాదం ఉందన్నారు. అలాగే రానున్న రోజుల్లో ఉద్యోగోన్నతులు, బదిలీల సమస్యలు కూడా తక్షణమే పరిష్కరించాలన్నారు. లేకుంటే ఈ నెల 15న రాష్ట్ర కేంద్రంలో విద్యా భవన్‌ని వేలాది మంది ఉపాధ్యాయులతో ముట్టడించే ఆందోళన కార్యక్రమం చేపడతామన్నారు. ఉపాధ్యక్షురాలు విజయగౌరి మాట్లాడుతూ మోడల్ ప్రైమరీ స్కూల్స్‌తో పాటు బేసిక్ ప్రైమరీ స్కూల్స్, బేసిక్ స్కూల్స్ కూడా తగినంత ప్రాధాన్యత కల్పించాలన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ కోశాధికారి ఇవిఎస్ఆర్.ప్రసాద్, కార్యదర్శులు, ఇ.శ్రీమణి, సిహెచ్.దయానిధి, కె.రమేష్ బాబు, చిలుకూరి శ్రీనివాసరావు, సిహెచ్‌వి.రమణ, మనోహర్, శ్రీనివాస్ మూర్తి, నర్సారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జె.రూపస్‌రావు, ప్రకాష్‌రావు జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, యుటిఎఫ్ బాధ్యులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

నేడు డిఎస్‌సిపై అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం : డిఎస్‌సి అభ్యర్థులకు యుటిఎఫ్, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో అవగాహనా సదస్సును నిర్వహిస్తున్నామని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఎ.షరీఫ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. మాజీ ఎంఎల్‌సి కె.లక్ష్మణరావు ఉదయం 10 గంటలకు కళా కేంద్రంలో ఈ అవగాహన సదస్సును నిర్వహిస్తారని తెలిపారు. సైకాలజీకి సంబంధించి మెటీరియల్ కూడా ఉచితంగా అందిస్తారన్నారు. డిఎస్‌సిలో ఎదురయ్యే ఎన్నో క్లిష్టమైన సమస్యలకు పరిష్కార మార్గాలు చూపించడమే కాకుండా, డిఎస్‌సిని ఎలా ఎదుర్కోవాలి, ఎలా చదవాలి, ఏ అంశానికి ఎంత ప్రయారిటీ ఇవ్వాలి అనేదానిపై అవగాహన కల్పిస్తారన్నారు. డిఎస్‌సి అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి, నాయకులు రూపస్‌రావు, ఇవిఎస్ఆర్.ప్రసాద్, చిలుకూరి శ్రీనివాస రావు, ప్రకాష్‌రావు, కె.రమేష్, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

పోలీస్ పిజిఆర్ఎస్‌కు 34 ఫిర్యాదులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు 34 ఫిర్యాదులు అందాయని అధికారులు తెలిపారు. జిల్లా అడిషనల్ ఎస్‌పి(అడ్మిన్) ఎన్‌బిఎం.మురళీకృష్ణ, అడిషనల్ ఎస్‌పి(లా అండ్ ఆర్డర్) ఎవి.సుబ్బరాజు ఆధ్వర్యంలో పిజిఆర్ఎస్‌ను సోమవారం నిర్వహించారు. అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించారు.

ఘనంగా మాతృ దినోత్సవం

ప్రజాశక్తి-గోకవరం

గోకవరంలో టిడిపి యువనేత సిద్ద పవన్‌కుమార్ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు .బత్తుల సూర్యనారాయణ మెమోరియల్ ట్రస్ట్ బత్తుల సత్తిబాబు అనాథాశ్రమంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. భోజనం ప్యాకెట్స్, రొట్టెలు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ జ్యోతుల నెహ్రూ చేస్తున్న సేవా కార్యక్రమాలను స్పూర్తిగా తీసుకుని తన తల్లి సిద్ద నాగమణి జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించానని తెలిపారు. మాతమూత్రులకు శిరస్సాభివందనాలు తెలియజేసుకుంటూ మనస్ఫూర్తిగా మాతృమూర్తి దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆహారం, పండ్లు, పాలు, రొట్టెలు అందించానని తెలిపారు.

ఘనంగా నర్సుల దినోత్సవం

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు ఎబిఎన్ టౌన్ హాల్లో గవర్నమెంట్, కాంట్రాక్ట్ నర్సింగ్ సంఘాల ఆధ్వర్యంలో నర్సింగ్ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ కాంట్రాక్ట్ ప్రైవేట్ నర్సెస్, సచివాలయ నర్సులు, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ సంఘం అధ్యక్షురాలు దయామణి మాట్లాడారు. మృత్యువునకు ఎదురు వెళ్లి సేవలు అందించిన వారిలో నర్సులు ముందు వరుసలో ఉంటారన్నారు. నర్సుల సంక్షేమమే సమాజ ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ నర్సింగ్ చెబుతుందన్నారు. గాని దానికి భిన్నంగా ప్రభుత్వాలు స్టాఫ్ నర్సులకు ఇచ్చే సౌకర్యాల్లో వ్యత్యాసాలు చూపిస్తూ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్‌లను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు.

కేక్‌ను కట్ చేస్తున్న నర్సులు

ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించి పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నియమాకాలు జరిపి నాణ్యమైన నర్సింగ్ సేవలు అందించడానికి చొరవ చూపాలని కోరారు. నిడదవోలు సామాజిక ఆరోగ్య కేంద్రం హెడ్ నర్స్ హెప్సీబా మాట్లాడుతూ రోగులకు అందించే సేవలకంటే రికార్డుల పని పెరిగిపోయిందన్నారు. దీంతో తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనవుతున్నామన్నారు. సిబ్బంది కొరతతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలన్నారు. కాంట్రాక్ట్ నర్సులను రెగ్యులర్ చేయాలన్నారు. కెవిపిఎస్ నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవాస్పూర్తితో నేటి నర్సులు రోగులకు సేవలు అందించాలన్నారు. నర్సుల సంరక్షణ, ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేశారు. నర్సింగ్ వ్యవస్థలో రెగ్యులర్ నియమాకాలు జరపాలన్నారు. సంజీవిని హెల్పింగ్ హ్యాండ్స్ అధినేత రమణ మాట్లాడుతూ నర్సెస్ తనకు ఆదర్శమన్నారు. అందరికీ నర్సెస్ డే శుభాకాంక్షలు తెలిపారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన

ప్రజాశక్తి - కొవ్వూరు

ఈ క్రాఫ్ట్ ప్రకారం 1121 పిఆర్‌పి రకం ధాన్యం ప్రతి గింజనూ ప్రభుత్వం తక్షణం కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుందర్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రైతులు గామన్‌బ్రిడ్జి హైవేపై ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సుందర్‌బాబు మద్దతు తెలిపి మాట్లాడారు. రైతులు, కౌలు రైతుల వద్దనున్న ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలన్నారు. రబీ ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తయిందనే పేరుతో కొనుగోళ్లు నిలిపివేయడం తగదన్నారు. దీని వల్ల రైతులు, కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనానరు. మిల్లర్లు, ప్రైవేట్ వ్యాపారులు కూడా ధాన్యం కొనే పరిస్థితి లేదన్నారు. కొనుగోలు లక్ష్యం పూర్తయినా, ప్రతి గింజా కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు కావడం లేదన్నారు. కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు, నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం, దేవరపల్లి, నల్లజర్ల తదితర మండలాల్లో కొనుగోలు చేయాల్సిన ధాన్యం ఇంకా కళ్లాల్లోనే ఉండిపోయిందన్నారు. కొంత ధాన్యం వాహనాల్లోకి లోడ్ చేశారన్నారు. అవి కూడా నిలిచిపోవడంతో కిరాయిలు పెరిగి రైతులు నష్టపోవాల్సి వస్తుందిన్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే రైతాంగంతో కలిసి పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

ధాన్యం లోడుతో నిరసన తెలుపుతున్న రైతులు, కౌలు రైతులు

'రోటరీ' ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - నిడదవోలు

రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3020 గవర్నర్ డాక్టర్ మల్లా. వెంకటేశ్వరరావు రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు మిడ్ టౌన్‌లో సోమవారం పర్యటించారు. వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పాల్గొన్నారు..నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం చేశారు. సెయింట్ మార్టిన్ బోర్డింగ్ హోమ్‌కు 60 మంచాలు, రూ.40వేల విలువైన వాటర్ ఫిల్టర్స్‌ని అందజేశారు, నిడదవోలు ఎస్‌విడి.మహిళ డిగ్రీ కళాశాలలో ఐదుగురు విద్యార్థినులు ఒక్కొక్కరికి రూ.5వేల వంతున స్కాలర్ షిప్‌లు అందజేశారు, అనంతరం వివిధ రంగాలలో సేవలు అందిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు ఖండవల్లి. గోపాలస్వామికి, బి.కాంటయ్య, ఎ.వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఈ ఒదర్భంగా వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు గుబ్బల సత్యప్రసాద్, సెక్రటరీ ఆకుల.రాజీవ్, అసిస్టెంట్ గవర్నర్ డి.కష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనాలియో ఆదర్శనీయుడు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

బుద్ధుని బోధనలతో ప్రజలను చైతన్య పరుస్తూ, విద్యార్థులకు బోధనాపరంగా సాయం అందిస్తూ, పేదలకు వైద్య శిబిరాలను నిర్వహిస్తూ అనేక మందికి పలు రకాల సేవలు అందిస్తున్న పీఠాధిపతి భంతే అనాలయో ఆదర్శనీయుడని ఎంఎల్‌సి సోము వీర్రాజు అన్నారు. సోమవారం బుద్ధ పూర్ణిమను పురస్కరించుకుని బౌద్ధ ధమ్మ పీఠంలో పీఠాధిపతి, హ్యూమన్ రైట్స్ నేషనల్ సెక్రటరీ భంతే అనాలయో ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్‌సి పాల్గొన్నారు. 100 మంది పేదలకు ఒక్కొక్కరికి సుమారు రూ.3వేల విలువైన నిత్యావసరాల కిట్లను, మరో 50 మందికి రూ.వేయి చొప్పున నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనాలయో మాట్లాడుతూ సిద్ధార్థుని జననం, బుద్ధుని గా అవతారం, మహా పరినిష్క్రమణం ఒకే రోజు కావడంతో, ప్రతి ఏడాది వైశాఖ బుద్ధ పూర్ణిమ రోజు పలు కార్యక్రమాలు, వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-కడియం

కడియపులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం ఉత్సాహంగా సాగింది. 1997లో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం మళ్లీ కలుసుకున్నారు. నాటి గురువులతో కలిసి ఏర్పాటు చేసుకున్న ఈ అపూర్వ కలయిక ఎంతో సందడిగా సాగింది. ఉద్యోగ, వ్యాపార ఇతర రంగాల్లో స్థిరపడిన వారంతా కలుసుకొని తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాటి 80 మంది పూర్వ విద్యార్థులు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సాయిబాబు, నాగకుమారి, సిరియా బేగం, శ్రీనివాస్, జోషిలతో పాటు అటెండరు రమణమ్మను వేదికపైకి ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. అలాగే పూర్వ విద్యార్థులంతా ఎప్పుడు ఎవరికీ ఏ కష్టం వచ్చినా ముందుంటామంటూ ఈ వేదికపై హామీ ఇచ్చారు. అలాగే ఈ కలయిక ఏర్పాటులో చొరవ చూపిన కూసు శ్రీనివాసరావు, కర్రి గంగారావు, పేకేటి కేదారేశ్వరుడు, చౌదళ్ళ వెంకటేశ్వరరావు, గట్టి వెంకటేశ్వర స్వామి, కర్రి బండి దుర్గా రాజేష్, గాద గీత ప్రసాద్, గ్రంధి అప్పారావు, తానంకి కృష్ణవేణి, తల్తిరి వెంకట నాగలక్ష్మి తదితరులను అభినందించారు.

యాక్సిడెంట్ బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -దేవరపల్లి

కొద్దిరోజుల రోడ్డు ప్రమాదానికి గురై ఇంటికే పరిమితమైన మరపట్ల సురేష్‌కు జనసేన పార్టీ తరపున సువర్ణ రాజు ఆధ్వర్యంలో రూ.20వేలను సాయంగా సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు కాట్నం గణేష్, సీనియర్ నాయకులు అనిశెట్టి గంగరాజు, గౌరవాధ్యక్షులు పసుపులేటి ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



యుద్ధ ప్రాతిపదికన పూడికతీత పనులు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

నగరంలో పూడికతీత పనులు యుద్ధ ప్రాతిపదికన జరగాలని, తీసిన పూడికను ఎప్పటికప్పుడు తరలించాలని కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. తాడితోట జంక్షన్, ఆవ రోడ్డులో జరుగుతున్న పూడికతీత పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ప్రధాన డ్రెయిన్లలో వ్యర్థాలు నిల్వ ఉండకుండా ఉంటేనే వర్షపు నీరు సక్రమంగా పారుతుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఔట్ ఫాల్ డ్రెయిన్లు శుభ్రంగా ఉండేలా ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు కూడా వ్యర్థాలను కాలువల్లో వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం 5, 6 డివిజన్ల పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. శానిటేషన్ పనులు నూరు శాతం జరిగేలా ప్రజారోగ్య అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారుల్లో వాహనదారులకు ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రతిరోజూ రాత్రి సమయంలో పారిశుధ్య పనులను నిర్వహించాలన్నారు. ఉదయం ఇంటింటా చెత్త సేకరణ, అనంతరం మధ్యాహ్నం సమయంలో గ్యాంగ్ వర్క్ ద్వారా డ్రెయిన్లలో పూడికతీత, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు.

అనంతరం క్వారీ మార్కెట్‌లోని వెహికల్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా యార్డులో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు, మూవ్‌మెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ప్రస్తుతం ఎన్ని వాహనాలు వినియోగంలో ఉన్నది.? ఎంత మంది డ్రైవర్లు అందుబాటులో ఉన్నారో.? వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాడైన వాహనాలకు మరమ్మతులు నిర్వహించి వారం రోజుల్లోగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట ఇఇ రీటా, శానిటరీ సూపర్ వైజర్ శ్రీనివాస్ ఉన్నారు.

పూడిక తీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ గార్గ్

ఆర్‌టిసి బస్సు నుంచి జారిపడ్డ డీజిల్ ట్యాంకు

ప్రజాశక్తి - సీతానగరం

వంగలపూడి గ్రామ శివారులో సోమవారం ఆర్‌టిసి బస్సుకు చెందిన డీజిల్ ట్యాంకు జారి పడింది. డ్రైవర్ అప్రమత్తమై వెంటనే బస్సును రోడ్డు పక్కకు నిలిపివేశారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. పురుషోత్తపట్నం నుంచి రాజమండ్రి వెళ్తున్న ఆర్‌టిసి బస్సు వంగలపూడి గ్రామ శివారుకు వచ్చే సరికి ఈ ఘటన చోటు చేసుకుంది. ట్యాంక్ పూర్తిగా జారి పడటంతో రోడ్డుపై డీజిల్ ప్రవహించింది. బస్సు మధ్యలో నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న ఆర్‌టిసి అధికారులు వెంటనే మరొక బస్సును ఏర్పాటు చేసి, ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చారు. జారిపడిన డీజిల్ ట్యాంక్‌ను సరిచేసేందుకు మరమ్మతు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

నేరాలు ఘోరాలు

బస్సు ఢీకొని యువకుని మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

స్థానిక ఏనుగుబాయి తూము వద్ద రామచంద్రపురం నుంచి యానాం వెళుతున్న ఆర్‌టిసి బస్సు ఢీ కొని ఒక యువకుడు దుర్మరణం చెందారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... హసనబాద గ్రామానికి పిల్లి గోపాలకృష్ణ(27)కి గత నెల 22న వివాహమైంది. సోమవారం అంతవారి ఇంటికి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా ఏనుగుబాయి తూము వద్ద ఆర్‌టిసి బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు గ్రామానికి చెందిన 17 ఏళ్ల యువతి ఈనెల 10వ తేదీ నుంచి అదృశ్యమైందని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేశామని చాగల్లు ఎస్‌ఐ కె.నరేంద్ర తెలిపారు. యువతి వివరాలు తెలిస్తే తమను సంప్రదించాలని కోరారు.

దాడిపై కేసు నమోదు

ప్రజాశక్తి - సీతానగరం

బొబ్బిల్లంకలో డబ్బుల వ్యవహారానికి సంబంధించి జరిగిన దాడిలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం బొబ్బిల్లంక గ్రామానికి చెందిన కోమలి స్వామి, అదే గ్రామానికి చెందిన కోమలి వెంకన్నకు గతంలో కొంత డబ్బు ఇచ్చాడు. స్వామి తన డబ్బులు తిరిగి ఇవ్వమని అడుగగా వెంకన్న తిరస్కరించాడు. ఈ నేపథ్యంలో ఆదివారం వీరిద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. వెంకన్న ఆగ్రహంతో కూల్ డ్రింక్ సీసాతో స్వామి తలపై కొట్టాడు. ఈ దాడిలో స్వామికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాధితుడిని వైద్యం నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ స్వామి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు ఎస్‌ఐ రామ్‌కుమార్ కేసు నమోదు చేశారు.

10 మందిపై బైండోవర్ కేసు

ప్రజాశక్తి - గోపాలపురం

భీమోలు గ్రామానికి చెందిన పది మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. భీమోలు గ్రామంలో గల సర్వే నంబర్ 322లోని 18 ఎకరాల్లోని జీడిమామిడి, మామిడి తోటలు తమకే చెందుతాయని మారెడ్డి రత్నం, కోడి దేవి వర ప్రసాద్‌లకు చెందిన రెండు గ్రూపులు తరచూ ఘర్షణలకు దిగుతున్నారన్నారు. దీనిపై శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా రెండు గ్రూపులకు చెందిన పది మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ఆరు నెలల పాటు బైండోవర్ అమల్లో ఉంటుందనానరు. ఈ పదిమందిలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట శివారు కోదండరామపురం సమీపాన కారు విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొన్న ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగలేదు. పిఠాపురం వైపు నుండి వస్తున్న కారు సామర్లకోట వైపు అతివేగంగా వస్తూ కోదండరామపురం వద్ద రోడ్డు ప్రక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో విద్యుత్ స్తంభం విరిగి కారు ముందు భాగంపై పడింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉండటంతో స్థానికులు భయాందోళనలతో పరుగులు తీశారు. స్థానికుల సమాచారంతో విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. కారు నడుపుతున్న వ్యక్తి సూరంపాలెంలోని ప్రముఖ యూనివర్సిటీ ప్రిన్సిపల్ అని సమాచారం.

5,200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సోమవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 5200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ దుర్గార్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో భాగంగా సారా తయారీకి ఉపయోగించే 210 కిలోల నల్లబెల్లపు పొడర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడులకు సంబంధించి ఒకరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఆరుగురుని బాధ్యులుగా నిర్ధారించామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు చిట్టిబాబు, నరసింగరావు, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

పిడుగుపాటుకు నాలుగు దూడలు మత్యువాత

ప్రజాశక్తి - గోపాలపురం

పిడుగుపాటుకు నాలుగు దూడలు మృత్యువాత పడ్డాయి ఈ ఘటన మండలంలోని పెద్దగూడెంలో సోమవారం చోటు చేసుకుంది. అక్క బత్తులు పెద్ద వెంకటేష్‌కు చెందిన నాలుగు దూడలు మృత్యువాత పడ్డాయి. వాటి విలువ రూ.70వేలు ఉంటుందని వెంకటేష్ తెలిపాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

ప్రతి అర్జీ ప్రధానమైనదే : కమిషనర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీ ప్రధానమైనదేనని, వాటిని తక్షణం పరిష్కరించాలని కమిషనర్ కేతన్ గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. 29 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నిర్ణీత గడువులోగా అర్జీదారుల సమస్యలను నాణ్యతతో పరిష్కరించాలన్నారు. సోమవారం వచ్చిన అర్జీలు శనివారం నాటికి క్లోజ్ అయ్యేలా.. ఆయా విభాగాల హెచ్‌ఒడిలు చొరవ చూపాలన్నారు. కొన్ని సందర్భాల్లో ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో సమస్యలపై పరిశీలన చేయాల్సి ఉంటుందన్నారు. కనుక వినతులపై అర్జీదారునికి కచ్చితంగా సరైన సమాధానం అందాలని సూచించారు. ప్రతి అర్జీని ఆన్ లైన్‌లో నమోదుచేసి.. ఎన్ని రోజుల్లో పరిష్కరించేది రసీదు ఇస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

పార్కు ఇలా... ఆడుకునేది ఎలా?

ప్రజాశక్తి- కడియం

సెలవుల్లో ఆడుకోవడానికి ఈ పార్కుకు వచ్చే పిల్లలకు నిరాశ ఎదురవుతోంది. మండల కేంద్రమైన కడియం గ్రామంలో కెనాల్ రోడ్డును ఆనుకుని, స్థానిక పశు వుల ఆసుపత్రి చెంతన పిల్లలు ఆడుకునేందుకు బాలల ఆనంద వేదిక పేర పార్కును ఏర్పాటు చేశారు. సరైన నిర్వహణ లేక పార్కు ప్రస్తుతం అధ్వానంగా మారింది. సరదాగా కాసేపు పిల్లలను పార్క్‌కు తీసుకువెళ్లి ఆనందంగా గడుపుదామనుకునే తల్లిదండ్రులు ఈ పార్కు పరిస్థితిని చూసి బయపడి వెనుక్కి వెళ్లిపోతున్నారు. గతంలో స్థానికులే కాకుండా మండలంలోని ఇతర గ్రామాల వారు కూడా తమ పిల్లలను పార్కు వద్ద ఆడుకోవడానికి తీసుకొచ్చేవారు. ప్రస్తుతం పార్కులోని ఆట పరికరాలు నిర్వహణా లోపంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఆడుకోవడానికి పిల్లలు రాక పార్కు బోసిపోతోంది. నాలుగు సంవత్సరాల క్రితం స్థానిక శ్రీరామదాస్ పేపర్ బోర్డ్ నిధులు సమకూర్చడంతో స్థానిక బాధ్యత సేవా సంస్థ అధ్యక్షులు గిరజాల బాబు పర్యవేక్షణలో ఈ పార్కు నిర్మితమైంది. అనంతరం కూడా అవసరం మేరకు ఆర్థిక సహకారం అందించేందుకు శ్రీ రామదాస్ పేపర్ బోర్డు యాజమాన్యం అంగీకరించింది కూడా. పార్కులో పారిశుధ్య నిర్వహణ, మంచినీటి సరఫరా, విద్యుత్ లాంటి కార్యక్రమాలు గ్రామ పంచాయతీ చేపట్టాల్సివుంది. కానీ పంచాయతీ పట్టించుకోకపోవడంతో పార్కు ఆవరణ వ్యర్థ పదార్థాలతో దర్శనమిస్తుంది. ఆట పరికరాలు పాడైపోయి, రోజులు, నెలలు గడుస్తున్నాయి. పార్కులో వ్యర్థాలు తొలగించని కారణంగా పాములు, విషపు పురుగులకు నిలయంగా మారింది. పార్కుకు విద్యుత్ సౌకర్యం, మంచినీటి సౌకర్యం ఉన్నప్పటికీ, నిర్వహణ లోపం వల్ల సక్రమంగా ఉండట్లేదని స్థానికులు చెబుతున్నారు. వేసవి సెలవులు కావడవంతో పిల్లలు ఆడుకునేందుకు పార్కుకు వచ్చి వెళ్లిపోతున్నారని చెబుతునానరు. పార్కును పరిశ్రమ యాజమాన్యం నిర్మించి, నిర్వహణ కొరకు ఆర్థికంగా సహకరించేందుకు సుముఖంగా వున్నా, స్థానిక నేతలు రాజకీయాలు చేయడం తగదని స్థానికులు అంటున్నారు. చేతనైతే నిధులు సమకూర్చి అభివృద్ధి చేయాలి తప్ప రాజకీయాలేంటని ప్రశ్నిస్తున్నారు.

చెత్త, పిచ్చిమొక్కల మధ్యన ఉన్న బెంచీలు

శిథిలమైన ఊయల, జారుడు బల్ల

బస్ షెల్టర్ లేక ప్రయాణికుల పాట్లు

ఎండకు దుకాణాల చెంతన పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

ఎండతో దుకాణాల చెంత చేరుతున్న వైనం

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు పట్టణంలో ప్రధాన కూడళ్లయిన అంబేద్కర్ చౌక్, గణపతి సెంటర్, గణేష్ చౌక్ సెంటర్లో బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎండకు తాళలేక పక్కనే ఉన్న దుకాణాల చెంతకు చేరుతున్నారు. కొంత మంది దుకాణదారులు నిల్చోడానికి ఒప్పుకోవట్లేదని, దీంతో ఎండలోనే ఉండాల్సి వస్తుందని వాపోతున్నారు. గతంలో చెట్లు ఉండేవని, ఏదొక చెట్టు నీడన తలదాచుకునేవాళ్లమని, ప్రస్తుతం రోడ్డును వెడల్పు చేయడంతో చెట్లను తొలగించారని ప్రయాణికులు చెబుతున్నారు. నిల్చునేందుకు చోటు లేక ఎండకి, వానకి తీవ్ర అవస్థలు పడుతున్నారు. బస్సు వచ్చేవరకూ ఎండలోనే ఉండాల్సిన పరిస్థితి. పలువురు ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు, వ్యాపారులు నిత్యం ఇక్కడ నుంచి ప్రయాణిస్తుంటారు. అయినా కనీసం బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. రాత్రి సమయంలో ప్రయాణికులు ఎక్కువడా ఉండటంతో ట్రాఫిక్ ఇబ్బదులు కూడా తలెత్తుతున్నాయి. బస్ షెల్టర్ లేకపోవడంతో బాలికలు, మహిళలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వెంటనే అధికారులు స్పందించి బస్ షెల్టర్, మరుగుదొడ్లను ఏర్పాటు చేయాని కోరుతున్నారు.

అందుబాటులోకి పలు సేవలు

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామ సచివాలయాల్లో పలు సేవలను అందుబాటులోకి వచ్చాయని తహశీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. రేషన్ కార్డు, ఇకెవైసి సేవలను అందుబాటులోకి తెచ్చారన్నారు. ఈ సేవలు గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ లాగిన్‌లో అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఇకెవైసి ప్రక్రియను నిర్వహించడానికి గ్రామ సచివాలయంలో పంచాయతీ సెక్రెటరీ, మహిళా కానిస్టేబుల్, వెల్ఫేర్ అసిస్టెంట్, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్‌లకు లాగిన్ సదుపాయం కల్పించామన్నారు. అధికారులు అందరూ రేషన్ కార్డుదారుల నుంచి ఇకెవైసి చేసేందుకు అర్హులన్నారు. ఈ నూతన విధానం వల్ల రేషన్ కార్డుదారులకు సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయన్నారు.

ఏప్రిల్‌లో 46,837 పని దినాలు

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం మండలంలోని ఏప్రిల్ నెలలో ఉపాధి కూలీలకు 46,837 పని దినాలు కల్పించామని ఎంపిడిఒ భారతి తెలిపారు. చెరువుల పూడికతీత, పంట కాలువల మరమ్మతులు, రైతుల పంట పొలాల్లో నీటి నిల్వ కుంటల తవ్వకం వంటి పనులను ఉపాధి హామీ చట్టంలో భాగంగా చేటప్టామన్నారు. మండలంలో మొత్తం 3,573 కుటుంబాలు ఉపాధి శ్రామికులుగా నమోదు చేసుకున్నారన్నారు. ఏప్రిల్ నెలలో వీరిలో 4,291 మందికి పని కల్పించామన్నారు. జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి పనులకు హాజరు కావొచ్చన్నారు. అనంతరం బొబ్బిల్లంకలో ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. ఉపాధి కూలీలు ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా పథకంలో చేరాలన్నారు. జాబ్ కార్డులు పొందాలనుకునే వారు తమ ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు ఖాతా జిరాక్స్ ప్రతులను ఫీల్డ్ అసిస్టెంట్లకు అందజేయాలని తెలిపారు. ఆమె వెంట ఎపిఒ సత్యవతి, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

ఇసుకకు ఇబ్బందులు లేకుండా చర్యలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

భవన నిర్మాణదారులు వర్షాకాలంలో ఇసుక కోసం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు స్టాక్ పాయింట్లలో ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డిఒ రాణిసుస్మిత తెలిపారు. మండలంలోని కుమారదేవం-1, 2 ఇసుక యార్డులను ఆర్‌డిఒ సోమవారం తనిఖీ చేశారు. అనంతరం ఆర్‌డిఒ మాట్లాడుతూ వర్షాకాలంలో నిర్మాణాలకు ఇసుక అందుబాటులో ఉండేలా డివిజన్ పరిధిలో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆయా పాయింట్లలో ఎంతవరకు ఇసుక నిలవలు ఉన్నాయో పరిశీలించామన్నారు. స్టాక్ పాయింట్ యార్డ్‌కు టార్గెట్ ఇచ్చామని, ఆ మేరకు ఇసుకను నిల్వ చేయాలన్నారు. ఇప్పటి వరకు 77,196 టన్నుల ఇసుక అందుబాటులో ఉందని తెలిపారు.

స్టాక్ పాయింట్లను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ రాణిసుస్మిత

ఇళ్ల నిర్మాణాల పూర్తికి కార్యాచరణ : కలెక్టర్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ విసి హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడుతో కలిసి రీ సర్వే, స్వామిత్వ, హౌసింగ్, ధాన్యం సేకరణ, రెవిన్యూ అంశాల పై డివిజన్ మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఉపాధి హామీ పథకం కింద పామ్ పాంట్ నిర్మాణ పనులను వర్ష కాలం వచ్చే లోగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఉపాధి హామీ కూలీలకు ఇన్సూరెన్స్ పథకం అమలు చేస్తున్నామన్నారు.ప్రమాదాలు సంభవించే సందర్భంలో ఆయా కుటుంబాలకి కల్పిస్తున్న భరోసా విషయాల్లో అవగాహన కల్పించడం, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడంపై దృష్టి పెట్టాలన్నారు. కౌలు రైతులకు అండగా నిలిచే క్రమంలో జిల్లాకి ఈ ఖరీఫ్ సీజన్‌కు 1.10లక్షల సిసిఆర్‌సి కార్డులు లక్ష్యంగా ఇచ్చామన్నారు. ఈ-క్రాప్ బుకింగ్, అడంగల్‌ను అనుసరించి కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులు జారీ చెయాల్సి ఉందన్నారు. గృహ నిర్మాణం కోసం అదనపు ఆర్థిక సహాయం అందించామన్నారు. అలాగే డిఆర్‌డిఎ, మెప్మా ఆధ్వర్యంలో అదనపు రుణ సదుపాయం కల్పించామన్నారు. అదనపు ఆర్థిక సహాయం పొందిన లబ్దిదారులు ద్వారా గృహ నిర్మాణం కోసం క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించాలన్నారు. ప్రతి శనివారం హౌసింగ్ డే సందర్భంగా లబ్దిదారులతో మమేకం అవ్వాలని కోరారు. గృహ నిర్మాణ పనులు విషయంలో నిర్లిప్తత చూపే వారి జీతాలు నిలుపుదల చేయాలనీ సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు రూపొందించిన కార్యాచరణ ఫలితాలు ప్రతిఫలించాల్సి ఉందన్నారు.సమీక్ష చేసిన తర్వాత కూడా పురోగతి సాధించక పోవడంపై మండల స్థాయి అధికారులు వివరణ కోరారు.

వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో క్షేత్ర స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలను జాగృతి చేయాలన్నారు. అటువంటి సమయంలో క్షేత్ర స్థాయిలో సిబ్బందికి నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి సూచనలు చెయ్యాల్సి ఉంటుందన్నారు.ఇటీవల కాలంలో ఎక్కువగా ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తున్నాయనీ, వాటిని అనుసరించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు మాట్లాడుతూ.. వీడియో కాన్ఫరెన్స్‌కు ఎవరు హాజరు అయ్యారో కాలేదో ఆర్‌డిఒలు ముందుగా నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. ఇటువంటి సమయంలో తహశీల్దార్ పనితీరు చూపడంలో అలక్ష్యం వహిస్తే సంబంధిత ఆర్‌డిఒ జవాబుదారీతనం కచ్చితంగా వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రీ సర్వే, స్వామిత్వ సర్వే పనుల విషయంలో నాణ్యత ప్రమాణాలు ఖచ్చితంగా పాటించేలా, గ్రౌండు ట్రూథింగ్ నూరుశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. రబీ ధాన్యం సేకరణ లక్ష్యాల్ని పూర్తి చేయాలని, అధిక వర్షాలు హెచ్చరికలు నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.

సమీక్ష చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

జవాన్‌ల మహోన్నత త్యాగం

ప్రజాశక్తి - పెద్దాపురం

దేశం కోసం ప్రాణాలర్పించడం వీర జవాన్ల మహోన్నత త్యాగానికి నిదర్శనమని ఎస్‌ఐ వి.మౌనిక అన్నారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో విద్యార్థులకు 30 రోజులపాటు గుడ్డు, అంబలి పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. తొలత పాకిస్తాన్ కాల్పుల్లో వీరమరణం పొందిన మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మనమంతా ప్రశాంతంగా ఉండేందుకు నిరంతరం శ్రమిస్తున్న జవాన్ల త్యాగాలను మనం గుర్తించుకోవాలన్నారు. చిన్ననాటి నుండి క్రమశిక్షణ, దేశభక్తి అలవర్చుకోవాలన్నారు. పిసిసి గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్ మాట్లాడుతూ మిషన్ అన్నపూర్ణ సహాయనిధి వ్యవస్థాపకులు దేవత రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో వెలగా త్రిపుర, సుధీర్ 30 రోజులపాటు విద్యార్థులకు గుడ్లు, అంబలి ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో దేవత రాజేష్ కుమార్, కరాటే శిక్షకులు తెప్పల యోగిస్, వ్యాయామ శిక్షకులు లోకేష్, పిసిసి కార్యదర్శి రొంగల అరుణ్ కుమార్, కూనిరెడ్డి రవికుమార్, అమృత, నమ్రత, సాయి, మణికంఠ, పవన్ కుమార్, హర్ష, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

జనరల్ నోటీసు
మహారాజశ్రీ అనకాపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
S.O.P. No. 5/2025

బిట్వీన్: 1.శ్రీమతి యలమంచిలి దుర్గాభవాని
2.శ్రీమతి యలమంచిలి వెంకట పద్మప్రియాంక
3.శ్రీ యలమంచిలి కార్తికేయ నాయుడు
... పిటీషనర్స్
అండ్: నిల్ ... రెస్పాండెంట్స్
ఇండియన్ సెక్సేషన్ యాక్టు సెక్షన్ 372 ప్రకారం

పై నెంబరు పిటిషన్‌లో 1వ పిటిషనరు యొక్క భర్తయున్నూ మరియు 2,3 పిటిషనర్సు యొక్క తండ్రియున్నూ అయిన శ్రీ యలమంచిలి లక్ష్మణరావుగారు, సామర్లకోట రైల్వేస్టేషన్, క్యాటరింగ్ సర్వీసెస్ ఫ్లాట్‌ఫారం స్టాల్-1ను నిర్వహిసూ తే 08-02-2025దిన మరణించియున్నారు. సదరు రైల్వే అథారిటీ / డిపార్టుమెంటు వారు సదరు స్టాలు కొనసాగించుకొనుటకు మరణించిన ఆసామీ తరపు వారసులుగా నిర్ణయిస్తూ సక్సేషన్ సర్టిఫికేట్ దాఖలు చేయమని అదేశించి యున్నారు. అంతట సదరు సక్సేషన్ సర్టిఫికేట్టు యిప్పించ గోరి పిటిషనర్సు పై నెంబరు పిటిషన్‌ను కోర్టులో దాఖలు చేసియున్నారు.

కావున, అందును గురించి ఎవరికైనను ఎటువంటి ఆక్షేపణలు వున్న ఎడల అట్టి వారు **ది. 24-6-2025న ఉదయం 10-30లకు** స్వయంగా పై కోర్టులో హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో శ్రీకోర్టు వారు ప్రస్తుతం వున్న పిటిషనర్ల, వాదనలు పరిశీలించి తగు విధముగా పరిష్కరించడమగునని ఇందుమూలంగా తెలియచేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)
సుంకర శ్రీనివాసరావు ఎమ్.ఎ., ఎమ్.ఎ., బి.ఎల్.
అడ్వకేటు & నోటరీ
వైజయంతి అపార్టుమెంట్, ఉడ్‌పేట,
అనకాపల్లి. సెల్: 98486 14189

క్రికెట్ టోర్నీ విజేత అచ్యుతాపురం జట్టు

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని అచ్యుతాపురంలో గ్రామ దేవత బాపనమ్మ తల్లి జాతర సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతగా అచ్యుతాపురం జట్టు నిలిచింది. అచ్యుతాపురంతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన పలు జట్లు ఈ టోర్నీలో తలపడ్డాయి. ఫైనల్ మ్యాచ్ అచ్చుతాపురం, గాదెలపాలెం జట్ల మధ్య సోమవారం జరిగింది. ఈ మ్యాచ్‌లో అచ్యుతాపురం జట్టు విజేతగా నిలిచింది. టోర్నీ నిర్వాహకులు కొత్తపల్లి వీరబాబు విన్నర్స్‌కు కప్ అందజేశారు. అదేవిధంగా రన్నర్స్ టీమ్‌కు బహుమతులు అందజేశారు.

ట్రోఫీతో విజేత అచ్యుతాపురం జట్టు

పురపాలక సంఘ కార్యాలయము, పిఠాపురం
ఆర్.ఒ.సి. నెం.33/2025-ఇ1 ది.12-05-2025
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

పిఠాపురం పురపాలక సంఘమునకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘ నిధుల నుండి 2 నెం. పనులు రూ. 57.91 లక్షలు మరియు సాధారణ నిధులు నుండి 2 నెం. పనులు రూ. 44.80 లక్షలు వెరసి మొత్తం పనులు 4 నెం. రూ. 102.71 లక్షలకు గాను ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా ఈ క్రింది తెలిపిన సైట్‌లలో టెండర్లు కోరబడుచున్నవి.

మిగిలిన వివరములు https://tender.apeprocurement.gov.in నందు మరియు ఇతర వివరముల కొరకు సెల్ నెం. 9849906523 ద్వారా తెలుసుకొనవచ్చును.

బిడ్డు డాక్యుమెంటు డౌన్ లోడ్ ప్రారంభ తేది : 12-05-2025 సమయం సాయంత్రం గం॥ 5.00
బిడ్డు డాక్యుమెంటు డౌన్ లోడ్ ఆఖరి తేది : 26-05-2025 సమయం సాయంత్రం గం॥ 4.30

సం/- **కమిషనరు,** పిఠాపురం పురపాలక సంఘం

డాక్యుమెంట్స్ పడిపోయినవి

జగ్గంపేట మండలం, కాట్రావులపల్లి గ్రామానికి చెందిన కందుల రాజ్యలక్ష్మి, W/o. విజయభాస్కర్ అను నేను తెలియజేయునది ఏమనగా,

నాకు కాట్రావులపల్లి గ్రామంలో సర్వే నెంబర్ డాక్యుమెంట్ నెం. 921/2016 మరియు S.No. 1043/2023 & C.No. 832/2023, Dt. 10-7-2023 జగ్గంపేటలో రిజిస్టర్ కాబడిన 277/3-A-1 లో 0.09 సెంట్లు జిరాయితీ మెరక భూమి కలదు. నా భూమి యొక్క ఒరిజినల్ డాక్యుమెంట్స్ తీసుకుని కాకినాడ వెళ్ళుచుండగా దివి. 27-4-2025వ తేదీన పెద్దాపురం దర్గా సెంటర్ నందు జిరాక్స్ తీయించుటకు చూసుకొనగా ఎక్కడో పడిపోయినది. దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు అందజేయవలసిందిగా కోరి ప్రార్థించుచున్నాను.

కందుల రాజ్యలక్ష్మి
W/o. గరగ విజయభాస్కర్
డో.నెం. 1-139/2, భవాని నగర్
కొత్తూరు సెంటర్, అచ్చంపేట జంక్షన్, కాకినాడ
సెల్: 9490401634, 9492156653

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - కొవ్వూరు

దీర్ఘకాలిక సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని కొవ్వూరు ఆర్‌డిఒ రాణి సుస్మిత తెలిపారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్‌ఎస్‌లో ఆమె పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిజిఆర్‌ఎస్‌లో 9 అర్జీలు వచ్చాయని తెలిపారు. ప్రజలు తమ అర్జీలను ఇవ్వడం కోసం నేరుగా రానవసరం లేదన్నారు. '1100 - మీకోసం కాల్ సెంటర్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చన్నారు. అలాగే స్థానిక సచివాలయాల్లోనూ అర్జీలు అందించొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎఒ రవివిక్రమ్, డివిజన్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం నగర పంచాయితీ
ఆర్‌ఒసి నెం.250/2024/ఇ1 ది.12-05-2025
ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్టు టెండరు నోటీసు

ముమ్మిడివరం నగర పంచాయితీ, ఇంజనీరింగు విభాగమునకు సంబంధించి సాధారణ నిధులతో వీధి లైట్ల మెటీరియల్స్ సప్లై చేయు పనికి రూ. 5.00 లక్షల అంచనాలతో ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా షార్టు టెండర్లు పిలువబడినవి.

బిడ్ డాక్యుమెంట్ ప్రారంభ తేది : 13-05-2025 ఉదయం గం॥ 11.00ల నుండి
బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ఆఖరు తేది : 19-05-2025 సాయంత్రం గం॥ 3.00ల వరకు
బిడ్ డాక్యుమెంట్ తీసుకొనుటకు ఆఖరు తేది : 19-05-2025 సాయంత్రం గం॥ 4.00ల వరకు

మిగిలిన వివరముల కొరకు కార్యాలయ పని వేళలలో ఇంజనీరింగు విభాగము నందు సంప్రదించగలరు.

సం/- **కమిషనరు**
ముమ్మిడివరం నగర పంచాయితీ

బౌద్ధ క్షేత్రాలను తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఆంధ్రప్రదేశ్ లో బౌద్ధ క్షేత్రాల్ని సరికొత్తగా తీర్చిదిద్దేందుకు కేంద్రం ప్రణాళికలు రచిస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. సోమవారం కృష్ణా జిల్లా ఘంటసాలలో రాష్ట్ర ప్రభుత్వ సృజనాత్మకత, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో జరిగిన బౌద్ధ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఘంటసాల గ్రామంలోని బౌద్ధస్తూపం ప్రాంగణంలో బౌద్ధ సాహితీ - చారిత్రక సదస్సులు మొదలుకొని వివిధ కార్యక్రమాలతో పాటు శయన బుద్ధ ప్రాజెక్టు ఆవరణలో భారీ సాంస్కృతిక ర్యాలీ, బౌద్ధ స్థూపం వద్ద సభ జరిగిన సభల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సమకాలీన సమాజానికి మంచి సందేశం ఇచ్చారని పేర్కొన్నారు .ఈ సందర్భంగా బుద్ధుని జీవిత గొప్పతనాన్ని మంత్రి దుర్గేష్ వివరించారు. వేల సంవత్సరాల తర్వాత కూడా బుద్ధుడు బోధించిన శాంతి, సహనం, అహింస, శాంతియుత సహజీవనం వంటి అంశాలు నేటికీ దిక్సూచిగా నిలవడం అసాధారణమైన విషయం అన్నారు. ప్రాచీన బౌద్ధ క్షేత్రంగా పరిఢవిల్లిన ఘంటసాలలో బుద్ధ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరగడం ఆనందంగా ఉందన్నారు. కేంద్ర పర్యాటక శాఖ దేశంలో బౌద్ధ సర్క్యూట్ ల అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో విశాఖ మొదలుకొని అమరావతి వరకు బౌద్ధారామాలు, బుద్ధుడి ఆనవాళ్లు కలిగిన ప్రాంతాలను కలిపి బుద్ధిస్ట్ సర్క్యూట్ గా చేసేందుకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు.ఇప్పటికే ఈ విషయమై న్యూఢిల్లీలో కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ను కలిశానని ఈ క్రమంలో బుద్ధుని ఆనవాళ్లు కలిగిన దక్షిణ భారతదేశంలో ప్రత్యేకించి ఏపీకి రెండు బుద్ధిస్ట్ సర్క్యూట్‌లు కేటాయించాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు మంత్రి దుర్గేష్ వివరించారు. ఈ నేపథ్యంలో బౌద్ధం ప్రచారంలోకి వచ్చిన విశాఖపట్నంలోని తొట్ల కొండ, బావి కొండ ప్రాంతాలను, బుద్ధుని సందేశాన్ని ముందుకు తీసుకెళ్లిన అమరావతి సమీపంలోని ఘంటసాల, భట్టిప్రోలు లు ప్రాంతాలను సర్క్యూట్ లు అభివృద్ధి చేసే ప్రతిపాదనకు కేంద్రం సుముఖంగా ఉందన్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయం, సాకుర్రు
టెండరు ప్రకటన
రి.క. నెం.02/2025 తేది.07-05-2025

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం మండలం, సాకుర్రు గ్రామపంచాయతీ 2025-2026 సంవత్సరమునకు గాను అవసరమగు ఈ దిగువ చూపిన ఐటెం తాలూకు వివిధ విడిభాగములు మరియు మందులు సరఫరా చేయుటకును మరియు వివిధ సేవలు నిమిత్తం సీలు వేసిన టెండర్లు ఈ దిగువ సంతకపు అధికారి వారిచే గాని, వారి అనుమతి పొందిన మరియొకరిచే గాని ది. 19-05-2025వ తేదీ మధ్యాహ్నం గం॥ 12.00లకు వరకు తీసుకొని అప్పటికి హాజరైన టెండరుదార్ల సమక్షములో మధ్యాహ్నం గం॥ 12.30లకు సదరు టెండర్లు తెరవబడును. మిగిలిన వివరములు కార్యాలయం పని వేళలలో తెలుసుకొనవచ్చును.

వ.నెం.	వివరములు	ధరావత్తు (రూ.)
1	2025-2026 సంవత్సరమునకు అవసరమగు ప్రజారోగ్య పనిముట్లు, మందులు సరఫరా చేయుటకు	500/-
2	2025-2026 సంవత్సరమునకు అవసరమగు మంచినీటి సరఫరా విడిభాగములు సరఫరా చేయుటకు	500/-
3	2025-2026 సంవత్సరమునకు అవసరమగు స్టేషనరి సామానులు సరఫరా చేయుటకు	500/-

సం/- **గుత్తుల చిరంజీవిరావు**
సర్పంచ్, సాకుర్రు గ్రామపంచాయతి

సం/- **వి.రమా శైలజ**
పంచాయితీ కార్యదర్శి, సాకుర్రు గ్రామపంచాయతి

గమనిక: 1. గ్రామపంచాయితీ నిధులు నిల్వలను అనుసరించి వరుస క్రమములో చెల్లించబడును.
2. గ్రామపంచాయితీనకు సరఫరా చేయబడు సామాన్లు మంచి నాణ్యత కలిగి మార్కు ISI కలిగి యుండవలెను.
3. టెండరును ఆమోదించుట గాని, నిరాకరించుటకు గాని పంచాయితీ వారికి పూర్తి అధికారము కలదు.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) KOTHAPETA
E.P. No. 1/2019 O.S. No. 28/2016

Between:
D.H.R : Karri Sudhakara Reddy
J.D.R : 1. Medapati Uma Varalakshmi (died)
2. Medapati Venkata Reddy
3. Goluguri Venkata Lakshmi
4. satti Lakshmi
5. Medapati Ananda Suryanarayana Reddy

D.H.R. తరపున వేయించిన వేలం ప్రకటన

పై నెంబరు గ్రంధములో E.P. తాలూక JDR కు సంపూర్ణ హక్కు భుక్తములో గల రావులపాలెం గ్రామంలోని యీ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిని పై నెంబరు E.P బాకీ రాబట్టు నిమిత్తం **ది. 16-06-2025 సం.రం. తేదీన ఉదయం 10-30 ని॥ల** నుండి పై కోర్టు వారి ఎదుట బహిరంగ వేలం వేయబడునని ఇందుమూలముగా తెలియ చేయడమైనది.

వేలం షెడ్యూలు

Dr. B.R. Ambedkar, Konaseema District, Ravulapalem, Sub. registrar Ravulapalem Village, Residencial site 201.67 Sq. yards in R.S.No. 266/1 (Supplemental S.No. 266/1 B2) bounded on

EAST : Sit of Velagala Meenakshi
SOUTH : Sit of Kovuri Thatha Reddy, Kovuri Musalamma & others
WEST : Sit of Goluguri Venkata Rami Reddy
NORTH : Sit of Goluguri Ramanjaneya Reddy & others
Within the boundaries
D.H.R Value - Rs. 5,00,000/-
Amina Value - Rs. 20,00.000/-

వంగూరి వెంకట సత్యనారాయణ
Dt: 12-05-2025 Advocate for D.H.R
Cell: 92900 73222, 7989146859